కథా కౌముది



# అమ్మకూచి

తమిళ మూలం: వి.యస్.నాగరాజన్

తెలుగు అనువాదం: గౌరీ కృపానందన్



*ఇటీవలే తన 80 వ పుట్టినరోజుని జరుపుకున్న నాగరాజన్ గారు, 50 సంవత్సరాల క్రిందట వ్రాసిన కథ ఇది.*

సావిత్రమ్మ మనసులో ఉన్నది చాలా సహజమైన, న్యాయమైన కోరిక. తనకు కోడలుగా రాబోయే అమ్మాయి కోడలుగా కాకుండా సొంత కూతురులాగా ఉండాలన్నదే ఆమె కోరిక. ఆడ సంతానం లేని ఒక తల్లి ఆ విధంగా కోరుకుంటే అందులో తప్పేముంది?

సావిత్రమ్మ ఇప్పుడే మొదటిసారిగా కొడుకుకి పెళ్ళి చేయబోవడం లేదు. ఇంతకు ముందే ఇద్దరు కొడుకులకి పెళ్ళిళ్ళు జరిగాయి. పెద్ద కొడుకు ఢిల్లీలో పెద్ద ఆఫీసరు. అక్కడే పెద్ద ఆఫీసరుగా ఉన్నాయన కూతురు అతనికి భార్యగా వచ్చింది. పెళ్ళైన తర్వాత అత్తగారింట్లో కొన్ని రోజులు ఉండడానికి వచ్చింది కొత్తకోడలు. సావిత్రమ్మ కళ్ళకి ఆ అమ్మాయి కోడలుగా కనబడలేదు. రేసు గుర్రాలను ఇంతకు ముందెప్పుడు ఆమె చూసింది లేదు. కాని కోడల్ని చూసినప్పుడల్లా ఆ జ్ఞాపకమే వచ్చింది. మంచి ఎత్తు, ఎత్తు తగ్గ లావు. బాగా టెన్నిస్ ఆడుతుందట. కప్పులు కూడా గెలుచుకున్నదట. మాట మాటకి కళ్ళద్దాలు సరి చేసుకుంటూ కోడలు తన వైపు చూసినప్పుడల్లా సావిత్రమ్మ భయంతో గజ గజ వణికిపోయేది.

రెండో కొడుకు హైదరాబాదులో ఉన్నాడు. అతనికి మంచి ఉద్యోగమే. మొదటి కోడలి విషయంలో తనకి కలిగిన నిరాశను సరి చేసుకోవడానికి సావిత్రమ్మ రెండో కొడుక్కి పెళ్ళి చేసేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకుంది. ఈ సారి ఉద్యోగస్తుల కూతుళ్ళ జాతకాన్ని కూడా వేలుతో తాకలేదు. ఆఖరున ఆమె ఎదురు చూసిన విధంగానే తంజావూరు భూస్వామిగారింటి అమ్మాయిని కోడలుగా నిశ్చయించిది. అమ్మాయి ఎక్కువగా చదువుకోలేదు. టెన్నిస్ ఎలా ఆడతారో తెలియదు. కళ్ళద్దాలు పెట్టుకోదు. సారె సంపద అంతా బాగానే తెచ్చింది. ఈ కోడలైనా తనతో ప్రేమగా ఉంటుందని, గౌరవం చూపిస్తుందని ఆశించిన సావిత్రమ్మకి ఈసారి కూడా ఆశాభంగం కలిగింది.

హైదరాబాదులో కాపురం చేస్తున్న ఈ కోడలు సంవత్సరానికి ఒకసారి వస్తుంది. రెండు రోజులు అత్తగారింట్లో ఉండి, గ్రామానికి పుట్టింటికి వెళుతుంది. అక్కడ్నినుంచి తిరిగి వచ్చేటప్పుడు క్రమం తప్పకుండా ప్రతీసారీ తల్లిని వెంటేసుకుని వస్తుంది. వియ్యంకురాలు వచ్చిన ప్రతిసారీ ఒక్కొక్క రోగం పేరు చెప్పుకుంటూ, డాక్టరుకి చూపించుకునే సాకుతో రోజుల తరబడి తిష్టవేసేది. కూతుర్ని హైదరాబాదుకు రైలు ఎక్కించే ముందు ఫ్లాట్ ఫారం మీద కంటికి మింటికి ఏకధారగా కూతుర్ని వదిలి పెట్టలేక శోకాలు పెట్టేది.

ఏది ఎలాగైతేనేం? సావిత్రమ్మకి తన మీద ప్రత్యేకంగా శ్రద్ధ, ప్రేమ చూపించి, తనని నోరారా అమ్మా అని పిలిచే కోడలు ఇంత వరకు రాలేదు. మూడో కొడుకు సేతు. నూటికి నూరు పాళ్ళు అమ్మకు ముద్దుల కొడుకు, గారాల తనయుడు. నిజంగా చెప్పాలంటే సేతుకు అమ్మ మీద ప్రేమ ఒక పాలు ఎక్కువే. అమ్మ గీచిన గీటు దాటడు. సినిమాకి వెళ్ళాలన్నా అమ్మ పర్మిషను తీసుకున్న తర్వాతే వెళతాడు. చుట్టుపక్కన తెలిసిన వాళ్ళందరూ "అమ్మ కూచి సేతు" అని అతని ముందే అనేవాళ్ళు. ఆ విషయం సావిత్రమ్మకీ తెలుసు. ఆ బిరుదును తల్లీ కొడుకులిద్దరు తప్పుగా అనుకోలేదు. న్యాయమైన బిరుదుగానే స్వీకరించారు. చదువు అయిన తర్వాత చిన్న ఉద్యోగమైనా చాలు అని చెన్నైలోనే ఉండిపోయాడు సేతు. ఢిల్లీ, ముంబైకి వెళితే మంచి ఉద్యోగం దొరుకుతుందని అన్నయ్యలిద్దరూ ఉత్తరాలు వ్రాసినా అతను వెళ్ళలేదు. తల్లి మీద ఉన్న ప్రేమే దానికి కారణం. ఆ విషయాన్ని వచ్చి పోయే వాళ్ళందరితో చెప్పి చెప్పి మురిసిపోయేది సావిత్రమ్మ.

ఈ కొడుకు పెళ్ళి తన స్వంత బాధ్యతగా జరిపించాలని సావిత్రమ్మ నిశ్చయించుకున్నందులో తప్పేమైనా ఉందా? సేతు నాన్నగారు ఏదో చెప్పాలని ప్రయత్నించినప్పుడు "మీరు కాస్త నోరు మూసుకోండి. మీరు పూనుకుని పెద్దవాడికి, రెండోవాడికి ఉత్తరం నుంచి దక్షిణం నుంచి సంబంధాలు చేసారు. మన సేతుకి అలా చెయ్యనివ్వను. అతనికి రాబోయే భార్య ఎలా ఉండాలో తెలుసా? పెద్ద కోడలిలాగా అధికారి కూతురుగా ఉండకూడదు. రెండో కోడలిగా భూస్వామంతుల కూతురుగాను ఉండకూడదు. వాళ్ళకి ఆస్థి అంతస్తులు ఉండాలి. కాని మరీ ఎక్కువగా ఉండకూడదు. అమ్మాయి కాస్త చదువుకున్న పిల్ల అయి ఉండాలి. కాని పెద్ద కోడలిగా టెన్నిస్ ఆడే పిల్లగా ఉండకూడదు. కళ్ళు మిరుమిట్లుగొలిపే అందచందాలు ఉండకూడదు. అందుకని మరీ కురూపిగాను ఉండకూడదు. రెండో వియ్యంకురాలి లాగా కూతుర్ని తలుచుకుని సదా కళ్ళల్లో నీళ్ళు పెట్టుకునే సంబంధం అస్సలు వద్దు." దీర్ఘంగా ఉపన్యాసం ఇచ్చింది సావితమ్మ.

"నీ ఇష్టప్రకారమే చూడమ్మా. అదే నాకూ ఇష్టం" అన్నాడు అమ్మకూచి సేతు.

సేతుకు కంపెనీలో ఉద్యోగం. సంవత్సరానికి రెండుసార్లు బోనసు ఇస్తారు. శని ఆదివారాలు రెండూ రోజులు సెలవు. ఎలాగో ఒకలాగా సేతుకి ప్రమోషన్ వచ్చింది. కాని ఆఫీసులో పెట్టిన కండిషన్ సేతుకి సమ్మతంగా లేదు. ట్రైనింగ్ అన్న పేరిట అతను ఏడెనింది నెలలు తిరుచ్చి బ్రాంచిలో పని చేయాలి. "నాకు ప్రమోషన్ వద్దమ్మా. నిన్ను వదిలి ఏడెనిమిది నెలలు నేను ఎలా ఉండగలను?" మనస్ఫూర్తిగా అన్నాడు సేతు.

సావిత్రమ్మకీ అదే సరి అనిపించింది. కాని తండ్రి ఒప్పుకోలేదు.

"ఒక ఆర్నెల్లు వెళ్ళి ఉండి రానీ. ఈ వయస్సులో ప్రమోషన్ తప్పి పోతే తర్వాత కష్టం" అన్నారాయన. సేతుకి వెళ్ళడానికి కొంచెం కూడా ఇష్టం లేదు. ఎలాగో బయలుదేరి వెళ్ళాడు. తిరుచ్చికి వెళ్ళిన ఆ వారమే శని, ఆదివారాలకి చెన్నైకి వచ్చేసాడు. అప్పట్నుంచి ప్రతీ వారం సెలవులకి చెన్నైకి వచ్చి అమ్మ చేతి వంట తిని వెళ్ళడం తప్పనిసరి అయ్యింది. రెండు నెలలు ఇలా సాగిన తర్వాత సావిత్రమ్మ అన్నది. "నిన్ను రావద్దని చెప్పలేకపోతున్నాను. రమ్మని చెప్పడానికీ నోరు రావడం లేదు. కొంచెం కూడా తీరిక లేకుండా రెండు రోజులు

ప్రయాణం చేస్తే ఒంటికి పడదు. అందువలన ఇక్కడికి వస్తే అదే రోజు మళ్ళీ బయలుదేరి వెళ్ళు. ఒకరోజు విశ్రాంతి తీసుకుని మర్నాడు ఆఫీసుకు వెడుదువుగాని."

సేతు అర్థమనస్కంగా ఈ ఏర్పాటుకు ఒప్పుకున్నాడు. ఎలాగో ఒకలాగా ట్రైనింగు ముగించుకుని మళ్ళీ అమ్మ చేతి వంట తినడానికి చెన్నై వచ్చి చేరి, ఎప్పటిలాగే అమ్మకూచి అయ్యాడు.

కొడుక్కి వచ్చిన సంబంధాలలో ఒక్కటి కూడా సావిత్రమ్మ షరతులకు సరిపోయేదిగా లేదు. ఆఖర్న వచ్చిన సంబంధం అన్ని విధాలుగా ఆమెకి తృప్తిగా అనిపించింది. అమ్మాయి తండ్రి  మధురైలో సర్కారు ఆఫీసులో సూపరింటెండ్ (ఆఫీసరు కాదు) మిగిలినవన్నీ కూడా సరిగ్గానే ఉన్నాయి.

పెళ్ళి చూపులకు మధురైకి వెళ్ళాలి. తనకి దూరపు బంధువు, చిన్న నాటి స్నేహితురాలు అయిన జానకి అక్కడ ఉన్నట్లు జ్ఞాపకం వచ్చింది. ఆమె చిరునామా వెతికి ఎలాగో పట్టుకుని ఉత్తరం రాసింది సావిత్రమ్మ.

మధురైలో జానకి ఇంటికి వెళ్ళి స్నానపానాలు అయ్యాక మీనాక్షి దేవాలయం, తిరుప్పర కున్రం, తిరుమలైనాయక్కర్ మహల్ అన్ని చోటలకి తల్లి తండ్రులని తీసుకెళ్ళి చూపించాడు సేతు. కొత్త ఊరిలో బస్సులో ఎక్కడానికి, కొత్త ప్రదేశాలకి వెళ్ళడానికి ఎటువంటి తడబాటులేకుండా దక్షతతో వ్యవహరిస్తున్న సేతుని చూసి జీవితంలోనే మొదటిసారిగా తన కొడుకు వట్టి అమ్మకూచి మాత్రమే కాదు, నిజంగానే కార్య దక్షతగలవాడు అని సావిత్రమ్మ తెలుసుకుంది.

మధ్యాహ్నం భోజనాలయ్యాక సేతు, అతని తండ్రి ముందు గదిలో పడుకుని చిన్నగా కునుకు తీసారు. సావిత్రమ్మ, జానకి పాత కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. ఆఖర్న జానకి అడిగింది.

"అది సరేగానీ నీకు ఈ సంబంధం ఉన్నట్లు ఎలా తెలిసింది? ఎవరైనా తెలిసిన వాళ్ళ ద్వారా అమ్మాయి జాతకం వచ్చిందా?"

"ఎవరి ద్వారానో రావడం దేనికి? మన ఇంట్లో పెళ్ళికి పిల్లవాడు ఉన్నాడు. వాళ్ళింట్లో ఎదిగిన అమ్మాయి ఉంది. వచ్చి అడిగారు. నాకేమో ఇది మంచి సంబంధం అనే అనిపిస్తోంది" అన్నది సావిత్రమ్మ.

"నేను చెపుతున్నానని తప్పుగా అనుకోకు. ఆ తర్వాత ఎప్పుడన్నా నీకీ విషయం తెలిస్తే నన్ను 'ముందే నీకు తెలియదా జానకీ?' అని నిలదీయకుండా ఉండాలని ముందే చెపుతున్నాను."

"విషయం ఏమిటి ?"

"నువ్వు పెళ్ళి చూపులకు వెళుతున్నావే, ఆ అమ్మాయి గురించి."

"ఏమిటే ఇది? పెద్ద రాయి తీసి నా నెత్తిన వేస్తున్నావా?"

"అవును ఆ పెద్ద రాయే. ఆ అమ్మాయి సంవత్సరం క్రితం కాలేజీలో చదివింది. అప్పుడు ఎవరో అబ్బాయిని ప్రేమించిందట."

"అయ్యో రామా!"

"ప్రేమ అంటే అలాంటి ఇలాంటి ప్రేమకాదు. అతనితో కలిసి సినిమా, డ్రామా, వైగై ఆనకట్ట అంటూ తిరగని చోటు లేదట."

"ఏమిటే నువ్వు చెప్పేది?" ముక్కు మీద వేలేసుకుంది సావిత్రమ్మ.

"నా చెవులదాకా వచ్చిన విషయాన్నే చెపుతున్నాను. ఈ ఊర్లో వాడ వాడలా అందరికీ ఈ విషయం తెలిసి నవ్వుల పాలైన తర్వాతే తల్లితండ్రులకి విషయం తెలిసింది. వెంటనే అమ్మాయి చదువుని మధ్యలోనే ఆపు చేయించి ఇంట్లో కూర్చోబెట్టారట."

"ఎంత అప్రతిష్ట?"

"ఆ అమ్మాయి ఆ అబ్బాయినే చేసుకుంటాను. లేకపోతే నూతిలో దూకి చస్తాను అని అన్నదట."

"దూకి చావక పోయిందా?"

ఏమో? దూకలేదు మరి. కూతురు ప్రేమ వివాహం చేసుకోవడం తల్లితండ్రులకు సుతారము ఇష్టం లేదు. ఆమె ఆ విషయం మర్చిపోవాలనే ఒక సంవత్సరం పెళ్ళి మాటెత్తకుండాఊరుకుని ఇప్పుడు పెళ్ళి చేసేయాలని తీవ్రంగా ఉన్నారు."

సావిత్రమ్మకి నోరు పడిపోయినట్లయింది. ఏం చెయ్యాలో పాలు పోలేదు. అంతలో అమ్మాయి తండ్రి వీళ్ళని తీసుకెళ్ళడానికి స్వయంగా వచ్చారు.

అమ్మాయి చూడటానికి బాగానే ఉంది. మొదటి చూపులోనే అందరి మనస్సులో స్థానం సంపాదించుకున్న ఆ అమ్మాయిని చూస్తున్న కొద్దీ జానకి చెప్పిన కథ జ్ఞాపకం వచ్చి సావిత్రమ్మకి వళ్ళు మండిపోయింది. పెళ్ళి కాకముందే ఒక అబ్బాయితో సినిమా, డ్రామాలకి వెళ్ళడానికి ఆ అమ్మాయికి ఎంత గుండె ధైర్యం ఉండాలి? ఈమె గనక తన ఇంటికి కోడలిగా వస్తే అమ్మకూచి అని అందరితో పిలవబడే, అమాయకుడైన తన కొడుకు సేతుని, తనని ఎన్ని ఆటలాడిస్తుంది? ఏది ఏమైనా సరే ఈ సంబంధం వద్దు.

సంప్రదాయమైన మాటలు ముగిసాక మగ పెళ్ళివాళ్ళు బయలు దేరారు. సావిత్రమ్మ అందరికన్నా ముందుగా "ఊరికి వెళ్ళి ఉత్తరం వ్రాస్తాము" అని చెప్పి బయలు దేరింది.

తల్లి ముఖం చూసి ఏమీ కనుక్కోలేక సేతు తల్లడిల్లిపోయాడు. ఆమె భర్తకు తన భార్య మాటలు, చేతలు ఏనాడు అర్థమయ్యింది లేదు.

చెన్నైకి వచ్చి రెండు మూడు రోజులైన తర్వాత సావిత్రమ్మ అన్నది. "సేతూ! మళ్ళీ ఒక జోస్యుడి దగ్గర మధురై అమ్మాయి జాతకాన్ని చూపించాను. ఆయన మీ ఇద్దరి జాతకాలు కలవలేదన్నారు. ఈ సంబంధం చేసుకోవద్దని చెప్పారు" అని అన్నది.

"ఏంటమ్మా ఇది? పెళ్ళి చూపులకి వెళ్ళే ముందే ఇద్దరు జోస్యులకి చూపించినప్పుడు అంతా సరిగ్గానే ఉందని చెప్పారు కదా?" అన్నాడు తనకే తెలియకుండా చిందులు వేస్తూ.

కొడుకు తన చేతి నుంచి జారిపోతున్నట్లు సావిత్రమ్మకి అనిపించింది.

"ఏమిట్రా నువ్వనేది? ఇద్దరికి చూపిస్తే మూడో చోట చూపించకూడదని శాస్త్రం ఏదైనా ఉందా?"

పట్టాభిరామయ్య అన్నారు. "నాకేమో సేతుకు వచ్చిన అన్ని సంబంధాలలో ఈ సంబంధమే బాగా నచ్చింది. అమ్మాయి తండ్రి చేసిన మర్యాదలు, అమ్మాయి చక్కదనం అన్నీ సరిగ్గానే ఉన్నాయి." సేతు తల్లి ముఖాన్ని సూటిగా చూస్తూ ధైర్యంగా అన్నాడు. "ఈ అమ్మాయి నాకు బాగా నచ్చింది. జాతకాలు కాస్త వెనకా ముందు అయినా ఫర్వాలేదు. నేను అడ్జెస్ట్ చేసుకుంటాను. ఈ సంబంధమే కావాలి."

"నాక్కూడా" అన్నారు పట్టాభిరామయ్య.

"వీల్లేదు. నాకు కొంచెం కూడా ఇష్టం లేదు. ఈ పెళ్ళి జరగడానికి నేను ఒప్పుకోను" అన్నది సావిత్రమ్మ.

"ఎందుకు వద్దంటున్నావో ఆ కారణం నువ్వు చెప్పి తీరాలి. జాతకాలు కుదర లేదని నువ్వు అన్నది అబద్ధం. నీ మనస్సులో వేరే ఏదో ఉంది. నీ మనస్సులో కల్గిన ఏవో పిచ్చి ఆలోచనల కారణంగా అనవసరంగా ఒక అమ్మాయి జీవితాన్ని బలి చేయకమ్మా." కళ్ళల్లో నీళ్ళు పెట్టుకోవడం తరువాయిగా అంటున్న కొడుకుని ఊసి "ఓరి దుంపతెగా" అన్నది సావిత్రమ్మ. "ఈ సంబంధం ఎందుకు వద్దు అన్న విషయాన్ని నా నోటితో నేను చెప్పకూడదనే అనుకున్నాను. ఆ అమ్మాయి ఇంతకు ముందు ఎవరినో ప్రేమించిందట. విషయం చాలా దూరానికి వెళ్ళిందట. ఆ పోకిరి వెధవతో సినిమా డ్రామా అని తిరగని చోటు లేదట. ఊరు ఊరంతా గొల్లుమందట."

"ఇదంతా నీకెవరు చెప్పారు?"

"ఎవరు చెపితేనేం? ఒకరికి ఇద్దరి దగ్గర అడిగి తెలుసుకున్నాను. పిల్ల తండ్రి దగ్గర చాటుమాటుగా అడిగేసాను కూడా."

"ఆ పోకిరి వెధవను నేనేనమ్మా."

"ఏమిట్రా అంటున్నావు? కల ఏదైనా కన్నావా?"

"కల కాదమ్మా, నిజం. ఆ అమ్మాయిని ప్రేమించింది నేనే. ఆమెను సినిమాకి, డ్రామాలకీ తీసుకెళ్ళిందీ నేనే."

"ఏమిట్రా నువ్వంటున్నదీ?"

"అవునమ్మా. పోయిన సంవత్సరం నేను తిరుచ్చికి వెళ్ళినప్పుడు మొదటి రెండు నెలలు శని ఆదివారాల్లో ఇక్కడికి వచ్చినప్పుడు నువ్వే అన్నావు కదా ఒక రోజు ఇక్కడ ఉంటే చాలు. మర్నాడు తిరుచ్చికే వెళ్ళి రెస్టు తీసుకోమన్నావు. మర్నాడు తిరుచ్చికి వెళ్ళకుండా మధురైకి వెళ్ళాను. గుడికి వెళ్ళి వస్తుంటే ఈ అమ్మాయిని చూసాను. సాక్షాత్తూ ఆ మీనాక్షి దేవి శిల ప్రాణం పోసుకుని నడిచి వస్తున్నట్లు అనిపించింది."

"ఓరి నీ అసాధ్యం కూల?"

"మరుసటి వారం కూడా మధురైకి వెళ్ళాను. ఆమె వెనకాలే ఇంటిదాకా వెళ్ళాను. తను కాలేజీలో చదువుకుంటుండేది. అందువల్ల ఇంట్లో వాళ్ళకి తెలియకుండా సినిమాకి, పార్కులకి తిరగడానికి సౌకర్యంగా ఉండేది."

"ఆ అమ్మాయి నాన్నగారికి నేవెవరో తెలుసా?"

"తెలియదు. ఆయన నన్ను చూడలేదు. ఎవరి ద్వారానో ఆ అమ్మాయి విషయం వాళ్ళ నాన్నగారికి తెలిసి మర్నాటి నుంచి ఆ అమ్మాయిని ఇంటి నుంచి బైటకి రానివ్వలేదు. అంతలో నాకు ట్రైనింగ్ ముగిసిపోవడంతో మళ్ళీ ఇక్కడికి వచ్చేసాను."

"మరి వాళ్ళకి మన అడ్రెస్ ఎలా తెలిసింది? జాతకం ఎలా పంపారు?"

"అదంతా ఇప్పుడు ఎందుకమ్మా? ఎవరి ద్వారా తెలిసిందన్న విషయమా ముఖ్యం?"

"నాకు తల తిరుగుతోంది. ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు." సావిత్రమ్మ కుర్చీలో చతికలబడింది.

"నాకు అర్థమయింది. ఒరేయ్ సేతూ! మధురై రైలుకు ఇంకా ఎంత సమయం ఉంది? నువ్వు వెళ్ళి వెంటనే ఒక టాక్సీ తీసుకురా. మిగిలిన విషయాలన్నీ నేను చూసుకుంటాను." పట్టాభిరామయ్య తన జీవితంలో మొదటిసారిగా భార్యను సంప్రదించకుండా ఒక నిర్ణయం తీసుకున్నారు.

అమ్మని ఒక్క మాట కూడా అడక్కుండా, షర్ట్ వేసుకోవడం కూడా మరచి పోయి టాక్సీ తీసుకుని రావడానికి ఆఘమేఘాల మీద వెళుతున్న కొడుకుని చూసిన తర్వాత ఇక ఈ సేతు అమ్మకూచి కాదు అని సావిత్రమ్మకి అర్థమైయింది.



చెన్నై వాస్తవ్యులైన గౌరి గారు తెలుగు నుంచీ తమిళంలోకీ, తమిళంనుంచీ తెలుగులోకీ అనేక కథలూ, నవలలూ అనువాదం చేసారు. వీరి అనువాదాలు తెలుగు-తమిళ భాషలలోని అన్ని ప్రముఖ పత్రికలలోనూ ప్రచురించ బడుతున్నాయి.